ప్రజాశక్తి

సోమవారం 26 మే 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మెరుగ్గా జలాశయాలు



- భారీ వర్షాలతో పెరిగిన నీటి నిల్వలు
- తగ్గిన వేసవి తీవ్రత
- కొనసాగుతున్న వానలు

ప్రజాశక్తి -గుంటూరుజిల్లా ప్రతినిధి

కృష్ణా బేసిన్‌లో జలాశయాల్లో కొంత కాలంగా నీటి నిల్వలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. కృష్ణా పరివాహక ప్రాంతంలో గత 10 రోజుల్లో భారీ వర్షాలు కురవడం వల్ల నీటి నిల్వలు పెరిగాయి. సహజంగా వేసవి కాలంలో మే చివరి నాటికి డెడ్ స్టోరేజికి చేరుకునే పరిస్థితులు కూడా కొన్ని సార్లు జరిగింది. ఈ ఏడాది కూడా ఈనెల 14 వరకు నిల్వలు తగ్గుతూ వచ్చాయి. అయితే 14 నుంచి క్రమంగా వర్షాలు కురుస్తుండటంతో నీటి నిల్వలు స్వల్పంగాపెరిగాయని అధికార వర్గాలు తెలిపాయి. వేసవిలో మే నెలాఖరులో ఇంత నిల్వ ఉండటం దాదాపు 15 ఏళ్ల తరువాత ఇదే ప్రథమం అని చెబుతున్నారు. 2009లో భారీగా వరదలు రావడంతోపాటు 2010లో కూడా సకాలంలో వర్షాలు కురవడం వల్ల నీటి నిల్వలు అప్పట్లో ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది కూడా గత 14వ తేదీవరకు నీటి నిల్వలు తగ్గుతూ గత 10 రోజుల్లో క్రమంగా పెరుగుదల నమోదు అవుతుండటం విశేషం. వాస్తవంగా ఈనెల 25 ఆదివారం

▶ 2లో



ర్యాలీలో పాల్గొన్న కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం, వివిధ ప్రజా సంఘాల నాయకులు

దేశ సమైక్యతను కాపాడుకోవాలి

- అమెరికాకు మోడీ లొంగుబాటు విధానం సరికాదు
- సమైక్యతా యాత్రలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

కుల, మతాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచిన ప్రజల ఐక్యతా స్ఫూర్తిని రానున్న కాలంలోనూ కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. దేశంలో ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా వ్యతిరేకించాల్సిందేనని అన్నారు. పహల్గాం దాడి, అనంతరం పాక్‌పై యుద్ధం, అమెరికా ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో సమైక్యతా యాత్ర నిర్వహించారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్ నుండి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ నిర్వహించగా సిపిఎం, ఇతర ప్రజా సంఘాల శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాదుల నుండి పర్యాటకుల్ని రక్షించటంలో కాశ్మీర్ ప్రజలు మతాలకు అతీతంగా ఉన్నారన్నారు. అయితే ఈ దాడిని అడ్డుపెట్టుకొని దేశంలోని కొన్ని శక్తులు ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే యత్నం చేస్తున్నాయన్నారు. అమెరికా తన అధిపత్యం కోసమే పాక్‌పై భారత్ యుద్ధంలో జోక్యం చేసుకుందని, అమెరికాకు మోడీ లొంగిపోవటం సరికాదని విమర్శించారు. భారతదేశంపై ఇతర దేశాల పెత్తనం దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం అన్నారు. సిపిఎం నాయకులు ఎమ్‌డి సలీం

▶ 2లో



ర్యాలీకి ముందు భాగంలో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఘాతుకులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదలం

వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు అంత్యక్రియల సందర్భంగా మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



అత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, టిడిపి శ్రేణులు



మాచర్ల ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుల కుటుంబీకులు, బంధువులు

ప్రజాశక్తి - వెల్దుర్తి, మాచర్ల

ప్రత్యర్థుల చేతిలో దారుణ హత్యకు గురైన గుండ్లపాడుకు చెందిన టిడిపి నాయకులు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. అంతిమ యాత్రలో టిడిపి శ్రేణులు భారీగా పాల్గొనడంతోపాటు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరై వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుకు నివాళులర్పించారు. అంత్యక్రియల అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘాతుకులను ఎట్టి పరిస్థితిల్లోనూ వదిలే ప్రసక్తే లేదన్నారు. హత్యలో పాల్గొన్న, తెర వెనుక పాత్ర

▶ 2లో

పచ్చని ఊళ్లో చిచ్చులా రగిలిన గుండ్లపాడు చరిత్రని

ఏ రక్తంతో రాయాలో?!

పాడిపంటలతో ప్రశాంతంగా ఉండాల్సిన గ్రామం రెండు గ్రూపులుగా చీలి హత్యలు, ప్రతిహత్యలు చేసుకుంటూ మనశ్శాంతి కరువై క్షణక్షణం.. భయంభయంగా గడుపుతోంది. ఊరుపై ఆధిపత్యం కోసం వ్యక్తుల మధ్య ప్రారంభమైన పోరుకు రాజకీయాలు తోడై ఆ గ్రామాన్ని ఆరని అగ్నిగుండగా మార్చాయి. ఆధిపత్య గొడవలకు భర్తలు, కొడుకులు, బిడ్డల ఫొటోలు గోడలకు వేళ్లాడుతుంటే కత్తి పట్టిన వారు ఆ కత్తికే బలవుతారనే విషయాన్ని పదేపదే గుర్తు చేస్తుంటాయి. కక్షలు, కార్పణ్యాలతో రావణకాష్టంగా రగులుతున్న గుండ్లపాడు రక్తచరిత్రను ఏ రక్తంతో రాయాలో..!

- కక్షలు, కార్పణ్యాలతో రావణకాష్టమైన గ్రామం
- ఫ్యాక్షన్ గొడవలకు 18 ప్రాణాలు బలి
- మృతుల్లో అన్నదమ్ములు, తండ్రీకొడుకులు
- నేటికీ ఆచూకీ దొరకని మృతదేహాలు
- అన్ని విధాలా చితికిపోయిన కుటుంబాలు





4 లో

నియామకాల్లో ఇష్టారాజ్యం

సినియార్టీకి దక్కని ప్రాధాన్యం - నిబంధనలకు తిలోదకాలు

ఎఎన్‌యు అధికారుల తీరుపై విమర్శల వెల్లువ



ప్రజాశక్తి - గుంటూరు రూరల్

అడ్డగోలు నియామకాలతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తనకు మరోసారి మరకను అంటించుకుంటోంది. పేపర్ల లీకేజీ, ఇన్‌ఛార్జి పాలన, నియామకాల్లో మీరుతున్న నిబంధనలు వెరసి వర్సిటీలో అస్తవ్యస్తత రాజ్యమేలుతోంది. రాజధాని ప్రాంతంలోని వర్సిటీ నాణ్యమైన విద్యాప్రమాణాలకు నిలయం కావాల్సిందిపోయి వివాదాలకు కేంద్రమవుతోంది. వర్సిటీ ప్రతిష్ట గత పాలకుల హయాంలో మసగబారగా ప్రస్తుత పాలకుల నిర్ణయాలతో మరింత అబాసుపాలవుతోంది. ప్రొఫెసర్ల సీనియారిటీ ప్రకారం కేటాయించాల్సిన విభాగాధిపతుల నియామకాలు కూడా వివాదాస్పదంగా మారుతున్నాయి.

అత్యంత వివాదాస్పదుడిగా ముద్ర వేసుకున్న ఒక ప్రొఫెసర్‌ను సైన్సు కళాశాలలో ఇటీవల పాఠ్య ప్రణాళిక మండలి విభాగ ఆధిపతిగా కాలపరిమితి పూర్తి కాకుండానే మరోసారి కొనసాగిస్తూ అనధికార ఆదేశాలు జారీ చేసినట్టు

▶ 2లో



ఆస్పత్రి వద్ద బందోబస్తు విధుల్లో పోలీసులు

ఘాతుకులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదలం

(మొదటి పేజీ తరువాయి)

పోషించిన ప్రతి ఒక్కరూ చట్ట ప్రకారం శిక్షించబడతారని హెచ్చరించారు. జంట హత్యల కేసుపై సత్వర విచారణ జరిపి, పాత్రధారులను, సూత్రధారులను తక్షణమే అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు.

ఆస్పత్రి ప్రాంగణంలో రోధనలతో విలవిల

ఇదిలా ఉండగా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు మృతదేహాలను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి శనివారం రాత్రి తరలించగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకల్లా పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబాలకు అప్పగించారు. మృతుల తాలూకా బంధువులు ఆస్పత్రికి తరలి రావడం, మహిళల గుండెలు బాదుకుంటూ విలపించడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతతోపాటు విషాధ వాతావరణం నెలకొంది. ఆస్పత్రి వద్ద పోలీసులు ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

దేశ సమైక్యతను కాపాడుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ పహల్గాం దాడి తర్వాత బిజెపి మంత్రులు ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి చేసే యత్నం చేశారన్నారు. కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరి అని అభివర్ణించటం తీవ్ర అభ్యంతరకరమని, అయినా ఆయా మంత్రులపై బిజెపి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ బిజెపి ఇటీవల చేసిన తిరంగ్ యాత్ర దేశ సమైక్యతను సూచించే విధంగా కాకుండా, దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు పెంచే విధంగా ఉందన్నారు. కాశ్మీరీ ముస్లిములు మమ్మల్ని కాపాడారు అని బాధితులు చెప్పడాన్ని గుర్తు చేశారు. దేశంలో హిందువులు, ముస్లిములు, సిక్కులు ఇతర అన్ని మతాలు ఐక్యంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచారన్నారు. సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం కూడా ఉగ్రవాదమేనన్నారు. బిజెపి అటువంటి విధానాలు ప్రోత్సహిస్తోందన్నారు. ఉగ్రవాదానిక మతం లేదనేది పవన్ కళ్యాణ్ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎల్.అరుణ , కె.అజయ్‌కుమార్, బి.ముత్యాలరావు, బి.లక్ష్మణరావు, సత్యనారాయణ, కె.శ్రీనివాస్, జి.రమణ పాల్గొన్నారు. ప్రదర్శనలో చిన్నారులు దేశభక్తి పాటలకు కోలాటం వేస్తూ పాల్గొన్నారు.

నియామకాల్లో ఇష్టారాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు వస్తున్నాయి. సీనియారిటీ ప్రకారం ఈ హోదాలు మరో ప్రొఫెసర్‌కు కేటాయించాల్సి ఉంది. సైన్సు కళాశాలలోని మరొక విభాగంలో ఒక సీనియర్ మహిళా ప్రొఫెసర్‌కూ అన్యాయం జరిగిందనే వాదనలున్నాయి. సీనియార్టీని విస్మరించి తమ అనుయాయులకే పదవిని కేటాయించారు. వర్సిటీలోని ఆరు కళాశాలలో ఒక కళాశాలైన ఆర్కిటెక్చర్ కళాశాలకు నెలల తరబడి ప్రిన్సిపల్‌ను నియమించలేదు. పరీక్షా భవన్‌ను ఒక అధికారి అవినీతి కేంద్రంగా మార్చేసి ప్రతి పనికి ఒక రేటు వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లినా స్పందన లేదు. వర్సిటీ వివాదాల కేంద్రమవుతున్నా దాన్ని గాడిలో పెట్టేందుకు పూర్తిస్థాయి వీసీని నియమించలేదు. అవినీతి ఆరోపణలున్న కో-ఆర్డినేటర్లపైనా చర్యలు శూన్యం. వివాదాస్పద గెస్ట్ లెక్చరర్ల విషయంలోనూ ఇంతే. ఈ అంశాలపై వర్సిటీకి సమీపంలోనే ఉంటున్న మంత్రి దృష్టి సారించి పరిస్థితులను చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

దర్జీ వృత్తికి వన్నెతెచ్చిన పర్చురి కేశవరావు

ప్రజాశక్తి-గుంటూరు

గత ఐదు దశాబ్ధాలుగా టైలరింగ్ వృత్తికి అంకితమై విలువైన ఖాతాదారుల అభిమానాన్ని, మన్ననలను పొందిన పర్చురి కేశవరావు వర్తమాన, రేపటి తరం దర్జీలకు ఆదర్శప్రాయమని నవ్యాంధ్రప్రదేశ్ టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు యర్రంశెట్టి వాలేశ్వరరావు అన్నారు. కిరణ్ టైలర్స్ వ్యవస్థాపకులు పర్చురి కేశవరావు టైలరింగ్ వృత్తిలో అర్ధ శతాబ్దం పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాల ఆత్మీయ సమ్మేళనం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలేశ్వరరావు మాట్లాడుతూ ఫ్యాషన్ ఒక కళ అయితే ఒక దర్జీ మంచి కళాకారుడై ఉంటాడన్నారు. ఒక మనిషి దర్జాగా, అందంగా, హుందాగా కనపడాలంటే మంచి దర్జీ కుట్టే దుస్తుల ద్వారానే ఉంటుందన్నారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కఅష్ణ, శోభన్ బాబు, రజనీకాంత్ వంటి సినీ హీరోల చిత్రాల విజయాలలో దర్జీలు కుట్టిన దుస్తులు విశేష ఆదరణ పొందాయనటంలో సందేహం లేదన్నారు. రాష్ట్రంలో రెడీమేడ్ దుస్తుల సునామీలో టైలరింగ్ వృత్తి నానాటికీ కుంచించుకుపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. మనిషి నాగరికతతో ముడి వేసుకున్న టైలరింగ్ వృత్తి కళాకారులను గుర్తించి వారి సంక్షేమం కోసం కృషి చేయవలసిన అవసరం ప్రభుత్వాలపై ఉన్నదన్నారు. స్వయం కృషితో టైలరింగ్ రంగంలో కేశవరావు రాష్ట్రస్థాయి ఖ్యాతిని అర్జించారని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోయ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం కేశవరావు, విజయలక్ష్మి దంపతులను రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి టైలరింగ్ సంఘాల నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ తెలంగాణ రాష్ట్రాల లేడీస్ ఫ్యాషన్ డిజైనర్ పేరిశెట్టి శిరీష, పి.కిరణ్, ఆడిటర్ కళ్యాణ్ చక్రవర్తి, కానుగుల నాగేశ్వరరావు, పి.మాధవరావు, వేల్పూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేశవరావు దంపతుల్ని సత్కరిస్తున్న టైలర్ సంఘాల నాయకులు

మెరుగ్గా జలాశయాలు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రోహిణీకార్తె ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు ఉంటాయి. కానీ ఈ ఏడాది రోహిణీ కార్తె ప్రారంభంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వేడిగాలులు లేకపోవడం ఈఏడాది ప్రత్యేకతగా పలువురు వాతావరణ నిపుణులు అంచనావేస్తున్నారు.

శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.08 టిఎంసిలు కాగా ఈనెల 14న కేవలం 36.77 టిఎంసిలు మాత్రమే నీటి నిల్వ ఉంది. తాజాగా ఆదివారం 39.39 టిఎంసిలకు నీటి నిల్వ పెరిగింది. నాగార్జున సాగర్ జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 312.04 టిఎంసిలు కాగా 10 రోజుల క్రితం 136.65 టిఎంసిలు నీటి నిల్వ ఉండగా ప్రస్తుతం అదే స్థాయిలో నీటి నిల్వ కొనసాగుతోంది. పులిచింతలలో గరిష్టనీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 25.67 టిఎంసిలుమాత్రమే ఉంది. అయితే 10 రోజుల క్రితం 26 టిఎంసిలు ఉంది. పులిచింతల నుంచి ప్రస్తుతం ప్రకాశం బ్యారేజికి నీటి విడుదల కొనసాగుతుండటం వల్ల స్వల్పంగా తగ్గినా గత ఏడాది కన్నా ఈ ఏడాది మెరుగైన నిల్వలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 18 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉంది. వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజి గరిష్ట నీటి నిల్వ 3.07 టిఎంసిలు కాగా ప్రస్తుతం 3 టిఎంసిలు నిల్వ ఉంది. 15 రోజుల క్రితం 2.60 టిఎంసిలు మాత్రమే నీటి నిల్వ ఉంది. గత నెలలో శ్రీశైలం, సాగర్‌నుంచి పూర్తిగా నీటి విడుదల నిలిపివేశారు. అయితే ఇటీవల కృష్ణా యాజమాన్యబోర్డు నిర్ణయం ప్రకారం వేసవి దృష్ట్యా తాగునీటి కోసం ఐదు టిఎంసిలు నీటిని విడుదలకు అనుమతి ఇచ్చారు.

వర్షాలు కురుస్తున్నా సాగర్ జలాశయం పరిధిలో గుంటూరు,పల్నాడు, ప్రకాశం, ఉమ్మడి కృష్ణా, బాపట్లజిల్లాల్లో తాగునీటి ఎద్దడి ఇంకా కొనసాగుతోంది. అందువల్ల తక్షణం ఐదు టిఎంసిల నీటి విడుదలకు అధికారులు చర్యలు చేపట్టారు. మే నెలలో 25వ తేదీ వరకు 48.2 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సిఉండగా ఇప్పటి వరకు 184.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వేసవి కాలంలో ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం చాలా అరుదని అధికారులుచెబుతున్నారు. అయితే గతేడాది నవంబరు వరకు ఏప్రిల్ వరకు కనీస వర్షాలు లేక తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడగా వేసవి తీవ్రంగా ఉండే సమయంలో వర్షాలు కురవడం అటు ప్రజలకు ఇటు అధికారులకు కొంత ఉపశమనం కలిగించింది.



పెనుమాకలో పోలీసుల 'పల్లెనిద్ర'

ప్రజాశక్తి - తాడేపల్లి

పల్లెనిద్రలో భాగంగా పెనుమాకను పోలీసులు ఆదివారం రాత్రి సందర్శించారు. గుంటూరు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సిఐ కళ్యాణ రాజు, ఎస్ఐ ఖాజావలి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బహిరంగంగా మద్యం తాగుతున్నారని, అతివేగంతో వాహనాలు నడుపుతున్నారని స్థానికులు చెప్పారు. వీటికి పాల్పడేవారి వివరాలు తమకు ఇస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు. స్కూల్ వదిలే సమయానికి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు గ్రామస్తులు కోరగా సానుకూలంగా స్పందించారు. శాంతిభద్రతలను పరిరక్షణ కోసం ప్రజలు తమకు సహకరించాలని కోరారు. అనవసరపు వివాదాల్లో చిక్కుకోవద్దని, ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. జూదం, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించబోమని చెప్పారు.



స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న పోలీసులు

గుండె పనితీరు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

మానవ శరీరంలో అతి ముఖ్యమైన భాగాలలో ఒకటైన గుండె పనితీరును ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆకుల శివప్రసాద్ అన్నారు.గుండె జబ్బులపై ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలా చిన్న వయసు వారు కూడా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, దుర్వ్యసనాలే దీనికి కారణం అని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజు కనీసం ఒక గంట వ్యాయామం చేస్తూ, మంచి ఆహార అలవాట్లు కలిగి ఉండి, మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియను మూత్రపిండములు చేస్తే ఆ పరిశుభ్రమైన రక్తాన్ని మన శరీరంలో వివిధ అవయవాలకు పంపి వాటి పనితీరు ఆరోగ్యంగా ఉంచే పనిని గుండె నిర్వహిస్తుందని, అలాంటి ముఖ్యమైన పని చేసే గుండె ఆరోగ్యాన్ని ఎల్లప్పుడూ బాగుండేలా చూసుకోవాలన్నారు. షుగర్ వ్యాధి ఉన్నవారు ఎల్లప్పుడూ వారి రక్తంలోని చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుకోవాలని, లేకుంటే గుండెకి రక్త సరఫరా దెబ్బతిని మిగిలిన అవయవాలకు కూడా సరిపడా రక్తం అందరక వివిధ అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. రక్తంలో చక్కెర శాతం అదుపులో ఉండకపోతే రక్తనాళాలలో పూడికలు ఏర్పడి గుండెకు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడి, స్టంట్స్ వేయడం, బైపాస్ శస్త్ర చికిత్స చేయాల్సి వస్తుందన్నారు. గుండెపోటు వచ్చిన వారిలో నీరసం, చెమటలు పట్టడం ఎడమ చేయి లాగడం, విరోచనం కావడం, చాతిలో బరువుగా ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయని, అలాంటి లక్షణాలు గమనిస్తే వెంటనే దగ్గరలోని హాస్పిటల్‌కి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. ఒక్కొక్కసారి గ్యాస్ట్రబుల్ నొప్పికి, గుండె నొప్పికి తేడా తెలియక ఏముందిలే అది గ్యాస్ నొప్పి అని నిర్లక్ష్యం చేయక డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. రోజు ప్రతి ఒక్కరు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని మనం తీసుకున్న ఆహారంలో ప్రోటీన్స్, కార్బోహైడ్రేట్స్, పండ్లు, ఆకుకూరలు సమపాళ్లలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. అధికంగా కొవ్వుశాతం ఉన్న ఆహార పదార్ధాలను మితంగా తీసుకుంటే మంచిదని సూచించారు. శాఖాహారం తీసుకునేవారు పన్నీర్, మష్రూమ్స్, సోయా, శనగలు, రాజ్మా, పెసలు లాంటి పప్పు ధాన్యాలు తీసుకుంటే మంచి ప్రోటీన్ లభిస్తుందని తెలియజేశారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ ఆకుల శివప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి కోఆర్డినేటర్‌గా టీ.వీ సాయిరాం వ్యవహరించగా, వేమన ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఆర్.రామచంద్రరావు, విద్యావేత్త ఇ..చంద్రయ్య ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆకుల శివప్రసాద్

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి- రెంటచింతల



సయ్యద్‌సాజిత్ (ఫైల్‌ఫొటో)

మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో సయ్యద్ సాజిత్ (20) విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన శనివారం అర్ధ రాత్రి చోటు చేసు కుంది. పసర్లపాడు గ్రామానికి చెందిన సయ్యద్ సాజిత్ తన అమ్మమ్మ గారి ఊరైన ఉప్పలపాడులో జరిగే వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడ స్టేజి మీద కొందరు నృత్యాలు చేస్తున్న సమయంలో వర్షం కురిసింది. అక్కడే ఉన్న సాజిత్‌కు ప్రమాద వశాత్తు విద్యుత్తు తీగ తగిలడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అవివాహితుడైన సాజిత్ దాచేపల్లి సమీపంలో సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. సాజిత్ తల్లి దండ్రులు సైదా, నాసరబి. ఇద్దరు కుమారుల్లో సాజిత్ పెద్దవాడు. ఎదిగి వచ్చిన కుమారుడు చనిపోవ డంతో కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - కాకుమాను

యార్లగడ్డ జయప్రద, రామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి కళ్ళు పరీక్షించడం జరిగిందని యార్లగడ్డ అంకమ్మ చౌదరి తెలిపారు. 284 మందికి కంటి శుక్లం ఆపరేషన్ చేయాడానికి నిర్ణయచడం జరిగిందని తెలిపారు. శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించారు.

శ్రోతలను ఉర్రూతలూగించిన అన్నమయ్య సంకీర్తన

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన సంకీర్తన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అతిధి గ్రాండ్ లో ఆదివారం రాత్రి తాళ్లపాక అన్నమాచార్యులు జయంతిని పురస్కరించుకొని 'అన్నమయ్య పదాంజలి' పేరిట కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కె.పురుషోత్తమరావు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. సంగీత ప్రియులు విశేషంగా పాల్గొని ఆస్వాదించారు. కార్యక్రమానికి వయోలిన్, మృదంగం, తబలా, కీబోర్డ్ సహకారాన్ని ప్రముఖ వాద్య కళాకారులు ఆంజనేయ శాస్త్రి, కానూరు వెంకట రామకృష్ణ, పెరవలి వంశీకృష్ణ, నల్లపాటి వెంకటేశ్వరరావు సమకూర్చారు. కార్యక్రమాన్ని కార్యదర్శి కె రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - తెనాలి



మాట్లాడుతున్న రూరల్ సిఐ ఉమేష్

ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రూరల్ సిఐ ఆర్ ఉమేష్ చెప్పారు. రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగజ్జీవన్ రామ్ రీడింగ్ రూమ్ వద్ద ఆదివారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ ఎస్సై ఆనంద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశిం చిన పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు, రవాణా యాక్ట్ సవరణ, భారతీయ న్యాయ సంహితపై అవగాహన కలిగించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నా యన్నారు. క్రెడిట్ కార్డ్ బిల్ పెండింగ్ ఉందని, ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా క్షణాల్లో రుణం మంజూరు చేస్తామని, ఆర్థిక నేరాలలో మీ పాత్ర ఉందని వచ్చే ఫోన్ కాల్స్ అన్ని సైబర్ నేరగాళ్ల పన్నాగంగా గుర్తించాలన్నారు. వారి వలలో పడి మోసపోయిన పలు సంఘటనలు వివరించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జరిగిన చట్ట సవరణలపై వివరించారు. ఎస్సై ఆనంద్ మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి అనుమానిత ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు 1903 కి వెంటనే ఫిర్యాదు చేయా లన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మోసపోకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్

మంగళగిరి పట్టణ సిఐ డి.వినోద్ కుమార్

ప్రజాశక్తి - మంగళగిరి

శాంతి భద్రతలకు ఎవరైనా భంగం కలిగించేలా వ్యవహరించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా అటువంటి వారిపై పిడి యాక్ట్ క్రింద కేసులు నమోదు చేస్తామని, నగర బహిష్కరణ తప్పదని మంగళగిరి పట్టణ సీఐ డి.వినోద్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో తరచూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల కు పాల్పడే నలుగురు నిందితులపై పోలీసులు పీడీ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేశారు. అందులో భాగంగా మంగళగిరి పట్టణంలోని బాప్టిస్ట్ పేటకు చెందిన బుల్లా మనోజ్ అలియాస్ సన్నీ పై పిడి యాక్ట్ క్రింద కేసు నమోదు చేసినట్లు సిఐ వినోద్ కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ భార్గవ తేజ ఆమోదం మేర కు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మంగళగిరి పట్టణానికి చెందిన బుల్లా సన్నీని రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించి నట్లుగా తెలిపారు. చేబ్రోలు, వట్టి చెరుకూరు, తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ముగ్గురు నిందితులపై కూడా పిడి యాక్ట్ ప్రయోగించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళగిరి పట్టణ సిఐ వినోద్‌కుమార్ మాట్లా డుతూ, మాదక ద్రవ్యాల రవాణా, కొట్లాటలు, దొంగ తనాలు, దోపిడీలు, అత్యాచారాలు, హత్యాయత్నాలు వంటి కేసుల్లో నిందితుడిగా పోలీసు రికార్డుల్లోకి ఎక్కితే పిడి చట్టం ప్రయో గిస్తామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల కు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా మన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజాజీవ నానికి ఆటం కం కలిగించే ఎవరైనా శిక్ష అనుభవించక తప్పదని తెలిపారు. పిడి యాక్ట్ నమోదు చేసిన క్రమంలో సీఐ వినోద్ కుమార్‌ను ఎస్పీ సతీష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

శిల్పులు కాటూరి త్రయాన్ని సన్మానించిన 'మానవత'



కాటూరి శిల్పులను సన్మానించిన మానవతా సభ్యులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం తెనాలి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మే నెల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటూరి ఆర్ట్ గ్యాలరి వ్యవస్థాపకులు, కాటూరి వెంకటేశ్వరరావు ని మానవతా సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన భారతమాత విగ్రహం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం బెల్లంకొండ వెంకట్ శిష్య బృందం, భారతమాతకు - మానవతావందనం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కాటూరి వెంకటేశ్వర రావుతో పాటు రవిచంద్ర, హర్షను సత్కరించి వారి జీవిత విశేషాలను సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్ తెలియ జేశారు. తెనాలి మానవత చైర్మన్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ కాటూరి శిల్పశాలలో రూపుదిద్దుకుంటున్న శిల్పాలు తెనాలికే కాదు రాష్ట్రానికి ఎనలేని కీర్తి తెచ్చి పెడుతున్నాయని చెప్పారు. అనంతరం కాటూరి రవిచంద్ర మాట్లాడుతూ చిన్నప్పటినుంచి తన తండ్రి అడుగుజాడల్లో ఈ వృత్తిలో కొనసాగుతున్నట్లు తెలిపారు. కళలను ప్రోత్సహిస్తూ ఒకే వేదికపై తమను సన్మానించటం ఆనందాన్ని కలిగించిం దని కాటూరి వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో సంస్థ సెక్రెటరి పి వెంకట్, జాయింట్ సెక్రెటరి డి.వి సోమయ్య శాస్త్రి, మహిళా విభాగ అధ్యక్షురాలు కళ్యాణి, కోశాధికారి ఎస్.వి శర్మ, మొవ్వ సత్యనారాయణ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి



అతిథులను సత్కరిస్తున్న అసోసియేషన్ బృందం

స్థానిక నందుల పేట కవిరాజా పార్కులో ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అసోసి యేషన్ అధ్యక్షులు మొవ్వ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కె కామేశ్వర రావు, కోశాధికారి ఏ ఎం ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు గుర్తింపు కార్డులు, ఈహెచ్ఎస్ సర్వీస్‌ల గురించి వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బఅందం అతిథులను సత్కరించింది. కార్యక్రమంలో అసోసియేషన్ పాలకవర్గం పి.పూర్ణచంద్రరావు, డాక్టర్ ఎన్ ఆదినారాయణ, పి కోటిరెడ్డి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - దుగ్గిరాల



బాధితురాలు మామిడి లక్ష్మి

మండలంలోని మోరంపూడి గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మామిడి లక్ష్మి అనే మహిళకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. ఉదయం 6 గంటల సమయంలో ఆరు బయట పని చేస్తుండగా కరెంట్ షాట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని బాధితురాలు తెలిపినది. ఇంట్లో ఉన్న సామానుతో పాటు నాలుగు సవరాల బంగారం కూడా కాలిపోయిందని తెలిపింది. నష్టం దాదాపు రూ.లక్ష వరకు ఉండవచ్చునని అంచనా. తెనాలి నుండి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు.

పురపాలక సంఘంలో అవినీతిపై సిఐడి విచారణ చేపట్టండి : కాంగ్రెస్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పురపాలక సంఘంలో జరిగిన అవి నీతి రాజకీయ ఒత్తిళ్ల ద్వారా జరిగిందా లేక బ్యూరో కాట్‌లు చేతివాటం ప్రదర్శించారా? అనే అంశం మీద ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారులతో లేదా సిఐడి విభాగంతో విచా రణ జరిపించి నిజం నిగ్గు తేల్చాలని చిలకలూరి పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం. రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సమగ్ర విచారణ జరిపించకుండా చిన్న స్థాయి ఉద్యోగుల మీద చర్యలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. సంవత్సరాల తరబడి జరుగుతున్న అవినీతి, అక్రమాలను గుర్తించడంలో ప్రభుత్వ ఆడిటింగ్ విభాగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పురపాలక సంఘంలో జరిగిన అవినీతికి సంబంధించిన అంశాన్ని బయటపెట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకునేందుకు ముందడుగు వేసిన పురపాలక సంఘ కమిషనర్ పి. శ్రీహరిరావును రాధాకృష్ణ అభినందించారు. 2021 నుండి 2024 సంవత్సరం ఎన్నికల సమయం వరకు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుని ప్రజాధనాన్ని దోపిడీ చేసిన వారు ఎవరైనా తగు చర్యలు తీసుకొని అవినీతికి గురైన సొమ్మును రికవరీ చేసి బాధ్యు లను కఠినంగా శిక్షించాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు.



కేకు కట్ చేస్తున్న బుర్ర ముక్కు వేణు గోపాల్‌స్వామి

ఘనంగా వేణు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లి

వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్ర ముక్కు వేణు గోపాల స్వామి రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తాడేపల్లి బైపాస్ రోడ్డు వద్ద ఉన్న సిఎస్ఆర్ కళ్యాణమండపం రోడ్డులోని వృద్ధాశమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అమరావతి కరకట్టపై ఉన్న చిగురు ఆశ్రమంలో బాలబాలికలకు పాఠశాల బ్యాగులు అందజేశారు. కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్ తినిపించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులుమూడి డేవిడ్ రాజు, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, షేక్ జావీద్, రాష్ట్ర విభాగ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, పట్టణ ఉపాధ్యక్షులు జీలగ పెదగాలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, జక్కిరెడ్డి ష్ణారెడ్డి, మేకా దామేశ్వర్ రెడ్డి, బషీర్, అభిమానులు, వేణ సైన్యం పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

క్యూఆర్ కోడ్ లేదా వెబ్ సైట్ లింక్ ద్వారా ప్రతి ఒక్కరూ నమోదు కావాలి

పల్నాడు కలెక్టరు అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జూన్ 21 న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జిల్లా ప్రజలందరి భాగస్వామ్యం పెద్ద ఎత్తున కావాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు విజ్ఞప్తి చేశారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగాంధ్ర పోటీలు ఆయా శాఖల వారీగా రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని మున్సిపాలిటీలలో యోగా స్ట్రీట్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.అదే విధంగా యోగాంధ్ర ప్రాధాన్యతను తెలిపే విధంగా జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ క్యూ ఆర్ కోడ్ లేదా వెబ్ ద్వారా ప్రతి ఒక్కరూ నమోదు కావాలని సూచించారు. వచ్చే నెల 21 న గ్రామ, వార్డుల ప్రాంతాలలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాల వద్ద పాల్గొనవచ్చునని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు భాగస్వామ్యం పెద్ద ఎత్తున కావాలని దానికై క్యూ ఆర్ కోడ్ లేదా వెబ్ సైట్ ద్వారా ప్రతి ఒక్కరూ నమోదు కావాలని కలెక్టర్ తెలిపారు. ఇంటర్నేషనల్ యోగలో పాల్గొనేందుకుhttps://yogandhra.ap.gov.in/#/home/launchone లింకు ద్వారా నమోదు కావాలని సూచించారు.

YOGANDHRA
Government of Andhra Pradesh
Scan & Register

క్యూఆర్ కోడ్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు చికిత్స పొందిన బాధి తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఈ మేరకు నరసరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ 57మంది లబ్ధిదారులకు రూ.1.09 కోట్ల చెక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. చెక్కులు పొందిన లబ్ధి దారులు నగదు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మహానాడుకు తరలిరండి

ప్రజాశక్తి- తాడేపల్లి

కడపలో ఈనెల 27 28 29 తేదీలలో జరిగే మహానాడుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, తెలుగు రైతు గుంటూరు జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి బాపిరెడ్డి కోరారు.ఆదివారం సాయంత్రం తాడేపల్లి టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరరావు యాదవ్, బాపిరెడ్డి మాట్లాడుతూ ఈనెలలో నిర్వహించనున్న మహానాడు పండగకు ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే నియోజకవర్గమైన మంగళగిరి నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు అద్దంకి మురళి, కేళి వెంకటేశ్వరరావు, తాడిబోయిన భాస్కర్, మస్తాన్ వలి, గోపి, కంభం సాయి చందు పాల్గొన్నారు.

పచ్చని ఊళ్లో చిచ్చులా రగిలిన గుండ్లపాడు చరిత్రను

ఏ రక్తంతో రాయాలో?!

- కక్షలు, కార్పణ్యాలతో రావణకాష్టమైన గ్రామం
- ఫ్యాక్షన్ గొడవలకు 18 ప్రాణాలు బలి
- మృతుల్లో అన్నదమ్ములు, తండ్రీకొడుకులు
- నేటికీ ఆచూకీ దొరకని మృతదేహాలు
- అన్ని విధాలా చితికిపోయిన కుటుంబాలు



మృతదేహాలకు పోస్టుమార్టం నేపథ్యంలో మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో విషన్నవదనంలో మృతుల కుటుంబీకులు, బంధువులు

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లాల్లో అత్యంత సారవంతమైన నల్లరేగడి భూములన్న గ్రామం వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు. పంట సిరులతో తలతూగుతున్న గ్రామాన్ని ఆధిపత్య పోరు, రాజకీయలు రక్తసిక్తం చేశాయి. 1971లో ప్రారంభమైన హత్యా ఘటనల్లో ఇప్పటి వరకు 18 మంది బలయ్యారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వర్గమే గ్రామంలో ఉంటుంది. ప్రత్యర్ధి పార్టీ వర్గం మళ్లీ తమ పార్టీ అధికారంలోకి వచ్చేదాక ఇతర ప్రాంతాల్లో తలదాచుకోవడమే. గత ఐదేళ్ల టిడిపి వర్గం గ్రామం వెలుపుల ఉండగా, ప్రస్తుతం వైసిపి వర్గం ఊరిని వదిలెళ్లింది.

మృత్యుపోరు మొదలు ఇలా..

గ్రామంలో బీసీలైన పెరిక, వడ్డెర సామాజిక తరగతులు, ఎస్సీలు అధికంగా ఉంటారు. పెరిక సామాజిక తరగతి రెండుగా చీలి జవిశెట్టి పెదనాగయ్య, సాని రామయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులుగా, దొంగరి చిన వీరయ్య జూలకంటి నాగిరెడ్డి (ఇండిపెండిట్) ముఠాకు చెందిన నాయకుడిగా పెత్తనం సాగించే వారు. ఊరిపై పెత్తనం కోసం వీరి మధ్య జరిగిన పోరులో మొదటి హత్య 1971లో జరిగింది. దొంగరి చినవీరయ్య గొట్టిపాళ్ళలో పనిమీద వెళ్ళి తిరిగి వస్తుండగా ప్రత్యర్థులు కాపుకాచిన హతమార్చారు. ఆ తరువాత 18 ఏళ్లపాటు పాటు ప్రశాంతగానే ఉన్నా 1989లో కక్షలు తిరిగి ప్రాణం పోసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ వర్గ నాయకులుగా పైవారే నాయకత్వం వహిస్తుండగా కొత్తగా పుట్టుకొచ్చిన టిడిపి తరుపున తోట కృష్ణమూర్తి, దొంగరి నాగేశ్వరరావు, చింతా చినవీరయ్య నాయకులుగా వ్యవహరించేవారు. 1989లో రెండువర్గాలు నాటు బాంబులుతో పరస్పరం దాడులకు దిగాయి. వందల బాంబులు పేలగా టిడిపికి చెందిన చింతా పెదవీరయ్య, కాంగ్రెస్‌కు చెందిన చింతా చినమల్లయ్య హత్యకు గురయ్యారు. 1990లో టిడిపికి చెందిన సాని కొండలను మాచర్ల పట్టణంలోని విష్ణుప్రియ లాడ్జి ఎదుట ప్రత్యర్థులు నరికి హత్య చేశారు. కొండలు హత్యకు ప్రతీకారంగా 1991లో కాంగ్రెస్ చెందిన తోట రాములును పొలంలో పని చేస్తుండగా ప్రత్యర్థులు హత్య చేశారు. ఈ హత్య కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్న ఇరువర్గాలు కేసుల్లో రాజీపడ్డా అది ఎంతో కాలం నిలవలేదు.

టిడిపికి చెందిన 14 ఏళ్ల తోట దగ్గు మల్లయ్యను ప్రత్యర్థులు ఇంట్లోనే హత్య చేశారు. 1993లో గ్రామాన్ని విడిచిన టిడిపి వర్గం శిరిగిరిపాడులో నివాసం ఉంటూ ప్రత్యర్థులపై దాడుల కోసం శిరిగిరిపాడులోని ఒక ఇంట్లో నాటుబాంబులు తయారు చేస్తూండగా ప్రమాదవశాత్తు పేలి దొంగరి నాగేశ్వరరావు, సాని చినకోటయ్య, సాని పుల్లయ్య, చింతా కొండలు, చింతా పెదకోటయ్య ప్రాణాలు కోల్పోయారు. 1995లో గ్రామంలోని ప్రధాన సెంటర్లో టిడిపి చెందిన గుడిబండ్ల బంగారయ్యను ప్రత్యర్థులు హత్య చేశారు. 1996లో గ్రామంలో వడ్డెర సామాజిక తరగతి కూడా రెండు వర్గాలుగా చీలి టిడిపి, కాంగ్రెస్ గూటికి చేరాయి. కాంగ్రెస్ గ్రూపునకు చెందిన ఈ సామాజిక తరగతి నేతలు ఉప్పుతోళ్ల రాములును అతని ఇంటిపై బాంబులు వేసి, కత్తులతో నరికి హత్య చేశారు. కొద్ది నెలల తరువాత ఉప్పుతోళ్ళ నాగేశ్వరరావును అటవీ ప్రాంతంలో సారా తయారీ బట్టీల వద్ద ప్రత్యర్థులు హత్య చేశారు. 1997లో టిడిపికి చెందిన దొంగరి నాగయ్యను గుండ్లపాడు గ్రామ నడిబొడ్డున ప్రత్యర్థులు నరికి చంపారు.

1999లో ఇరువర్గాల వారు రాజీ పడటంతో గ్రామంలో ప్రశాంతత నెలకొంది. తిరిగి 23 ఏళ్ల తరువాత రాజకీయ అధిపత్యం కోసం టిడిపికి చెందిన తోట చంద్రయ్యను 2022 జనవరి13న వైసిపికి చెందిన వారు నడిరోడ్డుపై హత్యచేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీలోనే తోట వెంకట్రామయ్య, జవిశెట్టి వెంకటేశ్వర్లు (మొద్దయ్య)లు రెండు గ్రూపులుగా విడిపోయాయి. గ్రామాధిపత్యం కోసం 2025 మే 24న అన్నదమ్ములైన జవిశెట్టి వెంకటేశ్వర్లు (మొద్దయ్య), కోటేశ్వరరావు ఓ శుభకార్యానికి వెళ్లి బైక్‌పై గ్రామానికి తిరిగి వస్తుండగా బోదిలవీడు గ్రామ శివారులో కాపుగాచిన ప్రత్యర్థులు బైక్‌ను స్కార్పియో వాహనంతో ఢీ కొట్టి ఇద్దర్నీ హత్యశారు.

హతుల్లో తండ్రీకొడుకులు, అన్నదమ్ములు..

ఆధిపత్యం కోసం బాంబులేసుకొని, కత్తులతో పొడుచుకొని, గొడ్డళ్లతో నరుక్కోని ఒకనొకరు చంపుకోవటమే కాదు.. శవాలను సైతం మాయం చేశారు.. తోట దగ్గుమల్లయ్య, దొంగరి నాగయ్య, గుడిబండ్ల బంగారయ్యను హత్య చేసిన ప్రత్యర్థులు ఆ శవాల్ని మాయం చేశారు. హత్యలకు గురైన వారిలో ఒకే కుటుంబానికి చెందిన వారు వున్నారు. సాని కొండలు, సాని చినకోటయ్య, సాని పుల్లయ్య అన్నదమ్ములు కాగా, చింతా పెదవీరయ్య, చింతా పెద కోటయ్య తండ్రీకొడుకులు. చింతా పేదవీరయ్యకు మేనళ్లల్లే పై ముగ్గరు సోదరులు. దొంగరి నాగేశ్వరరావు, దొంగరి నాగయ్య అన్మదమ్ములుకాగా వీరు తోటా చంద్రయ్యకు మేనళ్లల్లు. ఉప్పుతోళ్ల రాములు, నాగేశ్వరరావు అన్నదమ్ములు. ఈ హత్యల పరంపరలో ఎన్నో కుటుంబాలు చితికిపోయాయి. స్టేషన్లు, కోర్టులు చుట్టూ తిరుగుతూ కూడునిచ్చే పచ్చని పొలాలు, ఆస్తులు అమ్ముకొని ఆర్థికంగా కుదేలయ్యాయి. 1971లో దొంగరి చినవీరయ్య హత్యకు గురైయ్యే నాటికి ఆయనకు పదేళ్లలోపు వయస్సున్న ముగ్గరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఒక్కరికీ శిక్ష పడలేదు!

అనేక ఘటనలు, ఇన్ని హత్యల జరిగినా ఒక్క కేసులో కూడా ఎవరికీ శిక్ష పడిన దాఖలాలు లేవు. తప్పించుకోవడంలో వారు సిద్ధహస్తులయ్యారు. అవసరమైతే శిక్ష పడే సమయానికి ఇరు గ్రూపులు రాజీ పడి కేసులు కొట్టేయించుకుంటారు. తర్వాత ఫ్యాక్షన్ రాజకీయాలు యథావిధే. ఈ రాజకీయాల్లో ఎందరో సమిధిలవుతుంటారు. వీరిని మెట్లుగా చేసుకొని రాజకీయ నాయకులు అందలాలు ఎక్కుతుంటారు. అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ గ్రామంలో తగినన్ని నిధులు కేటాయించి, యువతను చదువువైపు, ఉద్యోగాలు వైపు వెళ్లేలా చూడాల్సిన అవసరాన్ని స్థానిక సామాన్యులు గుర్తు చేస్తున్నారు.

ఘనంగా గుంటూరు వేమయ్య శత జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వేమయ్య దంపతులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కామ్రేడ్ గుంటూరు వేమయ్య నిండునూరెళ్ళ జీవితాన్ని పూర్తి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు సిపిఎం నాయకులు, శ్రేయోభిలాషుల మధ్య 100వ పుట్టినరోజును జరుపుకున్నారు. సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ గుంటూరు వేమయ్య వెంకాయమ్మ నాలుగుతరాలను చూశారు. కొడుకులు, కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, ముని మనుమరాళ్ళు, ముని మనవళ్లు కామ్రేడ్ వేమయ్య వెంకాయమ్మకు వందోవ పుట్టినరోజును వేడుకగా నిర్వహించారు. సత్తెనపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వేమయ్య నూరేళ్ళ పండుగకు కుంటుంబ సభ్యులు, పార్టీ నాయకులు శ్రేయోభిలాషులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ వి.కృష్ణయ్య, సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధా కృష్ణ, గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ప్రముఖ న్యాయ వాది పిన్నమనేని పాములయ్య సిపిఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ వేమయ్య జీవిత విశేషాలను వివరించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్న వేమయ్య బళ్ళారి రాజమండ్రిసెంట్రల్ జైల్లో జైలుజీవితం గడిపారని చెప్పారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారని కొనియాడారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.





మనుమళ్లు మనుమరాళ్లు, మునిమనుమళ్లతో వేమయ్య దంపతులు

వేమయ్య దంపతులను కుటుంబ సభ్యులు, పార్టీ సభ్యులు, శ్రేయోభిలాషులు సత్కరించారు. వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో వేమయ్య కుమారులు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, గుంటూరు జగదీష్ కుమార్ కోడళ్ళు మల్లేశ్వరి, అనంతలక్ష్మి మనుమలు, మనుమరాళ్ళు గుంటూరు సాగర్‌అర్చన వినయ్, చంద్రిక, రేఖా, వాణి మునిమనుమడు ఆద్విక్ డిసీనెం 12 చైర్మన్ గుంటూరు రమేష్ కళావతి, గుంటూరు వసంతరావు పద్మ ఎక్స్ డిఇ యడ్లపల్లి సుధాకరరావు ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం,యూటిఎఫ్‌నాయకులు పాల్గొన్నారు.





వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న చిన్న కొండ్రు పాడు ప్రత్తిపాడు వెళ్లేబ్రిడ్జి, పడిపోయిన గడ్డిలోడు ట్రాక్టర్, రాళ్ళు లేచి కుంటలు పడి ఉన్న చిన్న కొండ్రు పాడు - ప్రత్తిపాడు రోడ్డు

అధ్వానంగా ప్రత్తిపాడు రోడ్లు

- రాళ్లు లేచి కుంటలు పడిన చిన్నకొండ్రుపాడు - ప్రత్తిపాడు రహదారి
- వర్షాలకు దెబ్బతిన్న బ్రిడ్జి
- ఇక్కట్లకు గురవుతున్న వాహనదారులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గత ఇరవై దశాబ్దాల నుండి ప్రత్తిపాడు లోని రోడ్లు పట్టించుకునే నాథుడు కరువయ్యాడు ప్రభుత్వాలు మారుతున్నాయి వస్తున్నాయి వారు ఉన్నపుడు మేము వేస్తాం వీరు ఉన్నపుడు మేము వేస్తాం అని ఏ పార్టీ ప్రభుత్వం లో ఉన్న కనీసం పట్టి పట్టనట్లు వ్యవహరిస్తుండటం తో ప్రజలు ఆగ్రహ ఆవేశాలతో ఓట్లు కి వచ్చి మాటలు చెప్పి ఓట్లు అయిపోయాక వారు ఏం ఎల్ ఏ లు మంత్రులు అవుతున్నారే తప్ప కనీసం పట్టించు కోవడం లేదు అని వాపోతున్నారు. గత ప్రభుత్వం లో ఉన్న మాజీ మంత్రి వారు గ్రామాల లోకి వెల్లినపుడు ప్రజలు రోడ్లు గురించి ప్రస్తావన తెచ్చినప్పుడు మీకు రోడ్డు వేసినపుడు మీ ప్రాంతం లో అడుగు పెడతా అని శబదం చేశారు.ఒక మంత్రి ఆ మాట చెప్పారు అంటే కచ్చితంగా రోడ్లు వేస్తారు అని అందరూ భావించారు. ఆ తర్వాత ఎన్నికలు. అప్పటి ప్రతిపక్షంలో ఉన్న నాయకులు మేము రోడ్లు వేస్తామని మాట ఇచ్చారు కానీ రోడ్లు మాత్రం వేయలేదు ప్రభుత్వం వచ్చి దాదాపు సంవత్సరం కూడా కావస్తుంది ఎమ్మెల్యే వచ్చినపుడు మండలం లో నాయకులు వెళ్ళి మా రోడ్లు వేయండి మేము ఊరిలో తల ఎత్తుకోలేక పోతున్నాం అని అడగడం ఎమ్మెల్యే వేస్తారు అని చెబుతున్నారు.

మరింత అధ్వానంగా రోడ్లు..

మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ప్రతి చిన్న పనికి ప్రత్తిపాడు వస్తు పోతూ ఉంటారు.ప్రత్తిపాడు నుండి చిన్న కొండ్రు పాడు వెళ్ళే వారు అదికంగా ఉంటారు ఎందుకంటే ప్రత్తిపాడు నుండి చిన్న కొండ్రు పాడు ఐదు కిలో మీటర్ల నేషనల్ హైవే వస్తుంది అంతే కాకుండా చిన్న కొండ్రు పాడు లో ఎక్కువగా కంపెనీలు హాస్పటల్ లు ఉన్నాయి కంపెనీలో పనుల నిమిత్తం మరియు అనారోగ్య సమస్యలు చూపించుకోవడం కోసం ఎక్కువ మంది ప్రజలు చిన్న కొండ్రు పాడు మార్గం ప్రయాణిస్తూ ఉంటారు. ఇలా ప్రయాణించే క్రమంలో ఎన్నో ప్రమాదాలు సంభవించి అనారోగ్య సమస్యలు ఏర్పడిన వారు లేకపోలేదు అంతే కాదు వాహనాలు కూడా పలుమార్లు రిపేర్లు చోటుచేసుకున్నాయి ఎండాకాలం అయితే దుమ్ము వాన కాలం అయితే బురద తో ప్రయాణించాల్సి ఉంటుంది ఇప్పుడు గత వరం నుండి కురుస్తున్న వర్షాలు కారణంగా ఈ రోడ్డు మరింత గుంతలు మరియు ఏర్పడి మరింత అధ్వానంగా తయారైంది మద్యలో బ్రిడ్జి అయితే ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుంది అని ప్రజలు బయాందోళనలో ప్రయాణిస్తున్నారు.వర్షాలు ఇలానే ఇంకా నాలుగు రోజుల కురిస్తే బ్రిడ్జి కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది అధికారులకు చెప్పాలన్న వారు మండలం కనిపించడమే కరువయ్యారు.ప్రభుత్వం రోడ్డు వేసి ప్రజలు సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నారు.

దేశ సమైక్యత కోసం అందరూ ఐక్యంగా నిలవాలి

ప్రజాశక్తి - పెదకాకాని

దేశ సమైక్యత మతసామరస్యం కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమిం చాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు పిలుపు నిచ్చారు. ఆదివారం పెదకాకానిలోని సుందరయ్య భవన్లో జరిగిన సమైక్యత సదస్సులో ఆయన మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మంది పౌరులను మృతికి కారణమయ్యారని, ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో దేశంలో మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఉగ్రవాదాన్ని దేశ ప్రజలందరూ ముక్తకంఠంతో ఎదుర్కోవాలని అయితే ఆ



మాట్లాడుతన్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు

పేరుతో మతతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతకు చిచ్చుపెట్టే చర్యలను వ్యతిరేకించాలన్నారు. పాకిస్తాన్ భారత్ల మధ్య యుద్ధాన్ని నేనే ఆపేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం మన దేశ సార్వభౌమత్వానికి గొడ్డలి పెట్టు అని అన్నినారు. నిత్యం యుద్ధాన్ని ప్రోత్సహించే ట్రంప్ శాంతిని కోరడం దయ్యాలు వేదాలు వల్లించడమేనన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని మరోవైపు ప్రజలకు ఉపాధి లేక జీవన ప్రమాణాలు పడిపోయాయని అన్నారు. రాజ్యాంగం లోని సమైక్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాల హక్కులను కాల రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు జరపాలని కోరారు. వెంటనే సుందరయ్య కాలనీ వాసుల ఇండ్ల పట్టాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సత్యనారాయణ బి.సాంబయ్య ఎస్.నీలాంబరం వి.శివయ్య కె. రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిచాలని రాజధాని పారిశుధ్య కార్మికుల ప్రదర్శన

ప్రజాశక్తి - తుళ్లూరు

అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ పారిశుధ్య కార్మికులు రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు.చాలీచాలని 12 వేల జీతంతో కుటుంబ పోషణ భారంగా ఉంటోందని, 21 వేలకు జీతం పెంచాలని కార్మికులు ప్రభుత్వానికి, సిఆర్‌డిఎ అధికారులకు విజ్ఞప్తి చేశారు. రక్షణ పరికరాలు మాస్కులు, గ్లౌజులు ఇవ్వాల న్నారు. ప్రదర్శన అనంతరం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షురాలు సి.హెచ్. సుశీల అధ్యక్షతన కార్మికుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడారు. పారిశుధ్యకార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు. కార్మికులకు గత ప్రభుత్వం నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్ ను వెంటనే పునరుద్ధరించాలన్నారు. రాజధానిలో అభివృద్ధి పనులు ప్రారంభమై జనాభా పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ఇస్తున్న వేతనాలు సరిపోక కార్మికుల కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయని అన్నారు. తక్షణం రాజధాని పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచాలని కోరారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పారిశుధ్య కార్మికులకు నిలిపివేసిన అమరావతి సామాజిక పెన్షన్ తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం మాటలలో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులకు పెన్షన్ పునరుద్ధరించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. రాజధాని



పారిశుధ్య కార్మికుల ప్రదర్శన

అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో క్రమక్రమంగా జనాభా సంఖ్య పెరుగుతుందని, ఈ క్రమంలో రాజధానిలో పారిశుధ్య కార్మికులకు పని ఒత్తిడితో పెరగడంతో ఇబ్బందుల కు గురవుతున్నారని, అనారోగ్యాల పాలవుతు న్నారని రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఒకొక్క కార్మికు డిపై ఇద్దరు కార్మికుల పని భారం పడుతుందని వెంటనే కార్మికులను రెట్టింపు చేయాలని రవి కోరారు.సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, అధికారులు అలసత్వం చూపితే మరో దశ పోరాటానికి రాజధానిలో పారిశుధ్య కార్మికులు సిద్ధమవు తారని అన్నారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఎల్.సుఖవేణి, ఎన్.లక్ష్మీ, తిరుపతమ్మ, ఎం.మేరీ, ఎం.శేషయ్య, ఎ.జోజి, వెంకటరమణ, పార్వతి, సునీత,కె మరియాదాసు,ఎం విజయ కుమార్, ఎం.కోటేశ్వరరావు, వి.బుజ్జి, హేమ,బలరాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

పహల్గాం దాడి ఉగ్రవాదుల్ని పట్టుకోవాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

మత సామరస్యన్ని కాపాడాలి దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమైక్య యాత్రలలో భాగంగా ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో ఉగ్రవాదానికి పాల్పడిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. ఇది దేశ ప్రజల మీద జరిగిన దాడి హిందూ ముస్లింల మధ్య జరిగిన ఘర్షణ కాదు అన్నారు. శాంతి కాముకులు మతసామరస్యాన్ని కోరుకోవాలని అన్నారు. దేశంలో మత ఘర్షణలులేపి రాజకీయ లబ్ధి పొందాలనుకునే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారత పాకిస్తాన్ల మధ్య యుద్ధం లేకుండా చర్యలు తీసుకున్నామని యుద్ధాన్ని తామే ఆపమని అమెరికా ప్రకటించటం దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టడమే అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జెట్టి బాలరాజు బి.లలితానంద ప్రసాద్, జి.శ్రీనివాసరావు నాగిరెడ్డి బి.అమ్మిరెడ్డి, ధనుంజయ్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో వినియోగదారులకు లబ్ధి

ప్రజాశక్తి- తాడేపల్లి



కార్మిక వినియోగదారుల సహకార సంఘం ద్వారా స్థానిక ప్రజలకు లబ్ధి చేకూరుతుందని సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.వెంకటరావు చెప్పారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య నగర్ లీలా సుందరయ్య కళావేదిక సమీపంలో కార్మిక వినియోగ దారుల సహకార సంఘం భవనానికి సిపిఎం నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ సుందరయ్య నగర్‌తో పాటు బైపాస్ రోడ్‌లో 3000 అపార్ట్‌మెంట్లలోని ప్లాట్స్‌లో ప్రజలకు విస్తృతమైన సేవలు అందించడానికి సహకార సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎటువంటి లాభాపేక్షా లేకుండా హోల్‌సేల్ ధరలకే నిత్యావసరాలతో పాటు ఆర్గానిక్ పదార్థాలు అందజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించబడుతున్న వినియోగదారుల సహకార సంఘం యొక్క అనుభవాలను తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య చుక్కపల్లి తిరుమలరావు, హైకోర్టు అడ్వకేట్ వెంకటేశ్వర్లు, సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, జి.సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, కె.మేరీ, వై.బర్నబా, ఎం.శ్రీనివాస్ రెడ్డి, డి.వి.భాస్కర్ రెడ్డి, ఎస్.గిరిజ, కే.గడ్డన్న, ఎస్.రామకృష్ణ, వై.సుబ్బారావు, పిన్నమనేని రాజా, శ్రీమన్నారాయణ, ఎన్.నాగేశ్వరరావు, సిహెచ్ భుజంగరావు, బి.రామారావు పలువురు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన సిహెచ్ఓల సమ్మె

ప్రజాశక్తి- గుంటూరు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వారి సమస్యల పరిష్కారం కోసం 27 రోజులపాటు చేసిన నిరవధిక సమ్మె ముగిసింది. సిహెచ్ఓల డిమాండ్లపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హామీ మేరకు సమ్మె విరమించినట్లు నాయకులు తెలిపారు. సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని, రాబోయే కాలంలో సమస్యలు పరిష్కారం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. సమ్మె కాలంలో సహకరించిన జిల్లా అధికారులకు ఎపిఎన్‌జిఒ, ఎపి హంస, సిఐటియు, ఎఐటియుసి, నర్సింగ్ సంఘాలు, విద్యార్థి సంఘాలకు సిహెచ్ఓల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.ప్రవళిక, పి.లింగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ, ట్రెజరర్ కె.సంధ్య ధన్యవాదాలు తెలిపారు.



సరుకులు అందజేస్తున్న జి.వి. మాధవరావు

పేదలకు 100వ నెల నిత్యావసర వస్తువుల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవి మాధవరావు ఆధ్వర్యంలో ఆదివారం లాయర్స్ స్ట్రీట్‌లోని అన్నా ప్రగడ సూర్య ప్రకాశరావు (సూరి) ఇంటి వద్ద 100వ నెల నియోజకవర్గంలోని వెనుక బడిన 35 కుటుంబాలకు, బియ్యం, చీరలు వితరణ చేశారు. పలువురు బ్రాహ్మణ పెద్దలు మాట్లాడుతూ వంద నెలలు నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం నూతన వస్త్రాలు అందించి నియోజకవర్గంలోని బ్రాహ్మణ కుటుంబ సభ్యులకు ఆప్తుడుగా నిలిచారన్నారు. అనంతరం జీవి మాధవరావు మాట్లాడుతూ కొన్ని సంవత్స రాలుగా బ్రాహ్మణ నిరుపేదల కోసం బ్రాహ్మణ పెద్దల సహాయ సహకారాలు తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించామనీ, వయో భారంతో నేటితో నిలిపివేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మత్స్య శాఖ ఆధీనంలో ఉన్న చేపల చెరువులు బహిరంగ వేలం

మత్స్యశాఖ సహాయ పర్యవేక్షకులు వెంకట రమణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మత్స్యశాఖ ఆదీనంలో ఉన్న రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామ చెరువు, నకరికల్లు మండలం లోని కుంకలగుంట ఎర్ర నల్లచెరువులను 1434 ఫసలికి చేపల పెంచుకుని పట్టుకునేందుకు వచ్చే నెల 6న రొంపిచర్ల తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు మత్స్య శాఖ నరసరావుపేట సహాయ పర్యవేక్షకులు సి.వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు నకరికల్లు తహశీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 2:30 గంటలకు కుంకలగుంట ఎర్ర నల్లచెరువు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7661950625 నెంబరులో సంప్రదించాలని కోరారు.

టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్‌ను నియమించినట్లు నరసరావు పేట నియోజకవర్గ టిడిపి కార్యా లయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. నాగిరెడ్డి, సురేష్ మాట్లాడుతూ తమ నియామ కాలకు సహకరించిన నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు, టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో టిడిపి పటిష్ఠతకు, బలోపే తానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. నాగిరెడ్డి, సురేష్‌ను పలువురు నియో జక వర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు అభినందించారు.


పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్

మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి


మాట్లాడుతున్న పిడిఎం నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు మృతి నేపథ్యంలో వారి మృత దేహాలను ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం తగదని పిడిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసరావుపేట మండలంలోని జొన్నగడ్డ గ్రామంలో పిడిఎం నాయకులు నల్లపాటి రామారావు మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు సోదరుడు తన సోదరుడి మృతదేహం ఇస్తామని చెబుతూనే ఇవ్వకుండా ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం నారాయణ పూర్ ప్రభుత్వ హాస్పిటల్, పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పడం సరికాదన్నారు. నంబాల కేశవరావు, సజ్జ నాగేశ్వరరావు, విజయలక్ష్మి, సంగీత, రాకేష్ మృతదేహా లను ఇవ్వకుండా ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టుల మృత దేహాలతో రాజకీయాలు చేయవద్దన్నారు. ఇటువంటి చర్యలను ప్రతి పక్షాలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని పిలుపు నిచ్చారు. మంత్రి అచ్చంనాయుడు తన నియోజకవర్గానికి చెందిన మావోయిస్టు నాయకుడు కేశవరావు అంత్యక్రియలు జరగకుండా అడ్డుకోవాలని చూడడం తగదన్నారు. కార్య క్రమంలో పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, పౌరహక్కులసంఘం నాయకుడు చికినంచిన్న పాల్గొన్నారు.

పల్నాడులో 4 పర్యాటక ప్రదేశాల్లో యోగా ప్రదర్శన

5న రాష్ట్ర స్థాయి కార్యక్రమం - కొనసాగుతున్న యోగా శిక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యోగాంధ్ర కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరికి యోగా గొప్పతనాన్ని వివరించి, వారి చేత యోగాస నాలను అభ్యసింపజేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగానే ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనీలు, టిఓటిలకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమం రెండో రోజు ఆదివారఎజూ కొనసాగింది. ఆన్లైన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో శిక్షణ నిర్వహించారు. యోగా గురువులు, టివోటీలు ఉత్సా హంగా పాల్గొన్నారు. జిల్లాలో 4 పర్యాటక ప్రాంతాలలో భారీ స్థాయిలో యోగా ప్రదర్శించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. దీని ప్రకారం ఈనెల 28న కోటప్పకొండ వద్ద, జూన్ 5న నాగార్జున సాగర్ వద్ద, 11 న కొండవీడు కోట వద్ద, 18న అమరావతి వద్ద యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో అంశాల ప్రాతిపదికగా ప్రతీ జిల్లాకు ఒక థీమ్‌ను ప్రభుత్వం కేటా యించింది. దీనిలో భాగంగా ఏఎన్ఎం,ఆశా వర్కర్లతో జూన్ 5 యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శిక్షణ పొందిన వారితో పాటు సామాన్య ప్రజలు సైతం ఈ యోగా స్ట్రీట్‌కి వచ్చి ఆసనాలను అభ్యాసం చేయవచ్చు.పోలీసు శాఖ అధ్వర్యంలో దీనిలో భాగంగా నేడు నరసరావుపేట కలెక్టర్ బంగ్లా రోడ్డు వద్ద ప్రధాన రహదారిపై యోగా కోసం ఏర్పాటు చేశారు.

పోలీసు నిఘా వైఫల్యంతోనే జంట హత్యలు

ఎస్పీని వెంటనే బదిలీ చేయాలి : కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల



మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

గుండ్లపాడు గ్రామంలో జరిగిన జంట హత్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, ఇది పూర్తిగా పోలీసు నిఘా మరియు ఇంటెలిజెన్స్ వైఫల్యమేనని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రామచంద్రారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. రెండు రోజుల క్రితం జిల్లా అత్యున్నత స్థాయి పోలీసు అధికారి గ్రామములో పల్లెనిద్ర చేసిన తర్వాత ఇలా జరగటం పూర్తిగా పోలీసు అధికారుల వైఫల్యమన్నారు. పల్లె నిద్ర కార్యక్రమంలో జరిగిన నిర్ణయాలను సమర్ధవంతంగా అమలు చేయడంలో ఆ అధికారి పూర్తిగా విఫలమయ్యారని, అలాంటి అధికారిని వెంటనే బదిలీ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఇలాంటి అధికారి వలన రాబోయే రోజుల్లో మాచర్ల నియోజకవర్గంలో శాంతిభద్రతలు మరింతగా క్షీణిస్తాయని ప్రజలు భావిస్తున్నారని రామచంద్రారెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో మాచర్ల,రెంటచింతల, వెల్దుర్తి మండల పార్టీ అధ్యక్షులు దొడ్డా శ్రీనివాసరావు, గాదె పుల్లారెడ్డి, వంగపాటి నాగరాజు, జిల్లా నాయకులు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

నేటి పిల్లల చేతుల్లో భారత్ భవిష్యత్తు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం పురస్కరించు కొని, స్థానిక స్వామి వివేకానంద ఆశ్రమం నందు మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వై రమేష్ బాబు మాట్లా డుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని, నేటి పిల్లల చేతుల్లోని భారత్ భవిష్యత్తు వుందని అన్నారు. భవిష్యత్తులో దేశానికి వారు అమూల్యమైన సంపదని అటువంటి పిల్లలు ఎవరైనా తెలిసో తెలియకో తల్లిదండ్రులకు దూరమై అనాధలుగా మారి న వారివివరాలను తెలుసుకొని దగ్గర్లోని పోలీస్ స్టేషన్లో కానీ అనాధాశ్రమాలకు గాని తెలియజేసి, వారి తల్లి దండ్రులకు అప్పగించే వరకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని కోరారు. సీనియర్ న్యాయవాది గంగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ అనాథ పిల్లలను కొన్ని అసాంఘిక శక్తులు తమ అసాంఘిక కార్యకలాపాలలో వినియోగించుకుంటున్నారనీ, వీటిని నిరో ధించాలని అన్నారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవ కమిటీ సభ్యులు మెట్టు గోవిందరెడ్డి, న్యాయవాదుల సంఘం కార్యదర్శి పి. అనిల్, న్యాయవాది వరప్రసాద్ పాల్గొన్నారు.




కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యుడు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కృష్ణవేణి, ఎస్వీఆర్ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో శ్రీధరియం ఆయుర్వేదిక్ ఐ క్లీనిక్, పంచకర్మ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఆదివారం పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కాలేజి నందు నిర్వహించిన ఉచిత కంటి, ఇతర సమస్యలపై ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ నుండి డాక్టర్ రామకోటయ్య, లయన్స్ క్లబ్ సాయి మార్కొండా రెడ్డి, వాసవి క్లబ్ ఓరుగంటి చెన్నకేశవ, మేడం నాగేశ్వరావు విచ్చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ వైద్య కేంద్రమైన శ్రీధరీయం ఆయుర్వేదిక్ పంచకర్మ వైద్యులు డాక్టర్ కృష్ణదాస్ ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కంటి మచ్చల క్షీణత, ఆప్టిక్ న్యూరోపతి, కంటి నీటి కాసులు, దూరదృష్టి లోపం, నిరంతర పొడి కన్నులు, కండ్ల కలక, కీళ్ళవాతం, వెన్నెముక సంబంధిత, జ్ఞాపక శక్తి, వెన్ను నరాల నొప్పి, ఉబ్బిన నరాలు సమస్యలు ఉన్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాధరణి మురళి, తుమ్మల ప్రసాద్, నాగూర్‌వలి, బ్రాంచి ఇన్‌చార్జి పవన్‌కుమార్ పాల్గొన్నారు.


చల్లా కుమారును సత్కరిస్తున్న వడ్డెర సంఘ నాయకులు

అధ్యక్ష పదవిపై ఒకటిన ప్రకటన

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్ష పదవికి వినుకొండ ఇందిరానగర్‌కు చెందిన చల్లా కుమారును ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు జూన్ ఒకటో తేదీన ప్రకటన చేయనున్నట్లు వడ్డెర సంఘం మాజీ అధ్యక్షులు గుంజి కాలింగ రాజు, ఐదు మండలాల వడ్డెర సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్ష పదవికి ఆసక్తి ఉన్న వడ్డెర కులస్తులు పోటీ చేయదలచిన వారు జూన్ ఒకటో తేదీ నరసరావుపేట రోడ్డులోని వడ్డే ఓబన్న విగ్రహం వద్దకు వచ్చి తెలపవలసిందిగా కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గుంచి కాళింగరాజు చల్లా కుమార్, విటరాజుపల్లి గ్రామం నుండి పున్నయ్య. పొట్లూరు నుండి తమ్మిశెట్టి చిన్న అంకారావు, నూజెండ్ల గ్రామం నుండి ప్రెసి డెంట్ ఈర్ల వెంకటస్వామి, నమాజ్ కుంట నుండి నరసింహారావు వెంకటనారాయణ భారతపురం గ్రామం నుండి వేముల వెంకటేశ్వర్లు ఈర్ల. పిచ్చయ్య, వినుకొండ ముట్లకుంట నుండి గుంజి. శ్రీనివాసరావు, తిమ్మాయి పాలెం నుండి కొమ్మెర. వెంకటరాయుడు, బత్తుల మహంకాళి, అడ్డరోడ్డు నుండి ఈర్ల ఆంజనేయులు, వినుకొండ ఇంద్రానగర్‌కు చెందిన ఈర్ల వాసు, పల్లపు వెంకటేశ్వర్లు పాల్గొని చల్లా కుమార్‌ను బలపరుస్తున్నట్టు తెలిపారు.

మోడీతీరు దారుణం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : మండల కేంద్రమైన రొంపిచర్లలో సిపిఐ మండల మహాసభ ఆదివారం జరిగింది. చెరువుకట్ట సెంటర్లో సిపిఐ జెండాను మాలెంపాటి నరసింహారావు ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్ అన్నారు. భారత్-పాకిస్తాన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారని మోడీ యుద్ధాన్ని ఆపడం దారుణమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక మున్సిపాలిటీ హామీ నెరవేర్చని మంత్రి..!

ప్రజాశక్తి- తాడేపల్లి

అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉన్నట్లుంది తాడేపల్లి పట్టణ పరిస్థితి. తాడేపల్లిని ప్రత్యేక మున్సిపాలిటీగా చేస్తానని చెప్పిన స్థానిక మంత్రి హామీ నేటికీ నెరవేర్చలేదు. తాడేపల్లి అంటే ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గొప్ప పేరు ఉండేది. నేడు ఉనికి కోసం తాపత్రయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 2018 వరకు తాడేపల్లిలో మేజర్ పంచాయతీ పాలన కొనసాగింది. 2009లో ప్రజలకు మరెన్నో సౌకర్యాలు కల్పిస్తామని తాడేపల్లి, కృష్ణ నగర్ పంచాయతీలును కలిపి తాడేపల్లి పురపాలక సంఘంగా ఏర్పాటు చేశారు. 2014లో తాడేపల్లి మున్సిపల్ ఎన్నికలు ప్రథమంగా జరిగాయి. ఆ ఎన్నికల్లో వైసిపి 23 వార్డులకు గాను 18వార్డులు గెలుచుకొని అధికారం చేపట్టింది. 2019 వరకు పాలకవర్గం అధికారం చలాయించింది. ఈ కాలంలోనే తాడేపల్లి పట్టణాన్ని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని అప్పటి పాలకవర్గం హామీ ఇచ్చింది. ఆసియా బ్యాంకు నుండి 50 వేల కోట్లు అప్పు తీసుకొచ్చి పట్టణ ప్రజలందరికీ శుద్ధమైన మినరల్ వాటర్ ఇస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. మున్సిపాలిటీ అయిన తాడేపల్లి ఈ 12 సంవత్సరాల కాలంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా వెక్కిరిస్తుంది. మరో పక్క తాడేపల్లి మీదుగా జాతీయ రహదారి పోవడం, విజయవాడ నగరానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో తాడేపల్లి ఉండటంతో బైపాస్ రోడ్డు ప్రాంతం పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయి. ఈ అపార్ట్‌మెంట్లతో 3600 మంది ప్లాట్లు కొనుక్కొని నివాసాలు ఉంటున్నారు. ఒక అపార్ట్‌మెంట్‌లో 350 నుండి



700 ప్లాట్స్ వరకు నిర్మాణం జరిగి గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణాలు కూడా శరవేగంగా ఎక్కడ అభివృద్ధి చెందాయి. వాటికి తగ్గట్టు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వినవస్తున్నాయి. పెద్ద ఎత్తున విస్తరిస్తున్న బైపాస్ రోడ్డు ప్రాంతం అపార్ట్‌మెంట్ల దగ్గర మురుగునీరుపారుదలు లేక ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు పెద్ద ఎత్తున వృద్ధి అవుతున్నాయి. వర్షం వస్తే డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. తాడేపల్లి కి భూగర్భ డ్రైనేజీ తీసుకొస్తామని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ సంవత్సర కాలమైన అమలకు నోచుకోలేదు. పెరిగిన పట్టణ అవసరాలు రీత్యా పారిశుధ్య కార్మికులు 300 పైగా పనిచేయాల్సి ఉంది. ప్రస్తుతం 170 మంది మాత్రమే పని చేస్తున్నారు. తగినంతమంది పరిశుద్ధ కార్మికులు లేకపోవడంతో పట్టణంలోనా వీవిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోతుంది. తాడేపల్లి పట్నంతో పాటు రూరల్ ఎనిమిది గ్రామాలు, రాజధానిలోని ఉండవల్లి పెనుమా గ్రామాలను కలిపి, మంగళగిరి మండలంలోని మరికొన్ని గ్రామాలను కలిపి ఎంటిఎంసి గ్రేటర్‌గా నామకరణం చేశారు. మంగళగిరి పట్టణానికి రూ 700 కోట్లు, తాడేపల్లి పట్టణానికి నికి రూ 700 కోట్లు నిధులు వచ్చేస్తున్నాయని, అభివఅద్ధి పరుగులెత్తటమే తరువాయని పెద్ద ఎత్తున పాలక పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. వాస్తవంలోకెళ్తే ఇంతవరకు ఆ రూ.1400 కోట్లు ఎటు పోయాయో ఎవరికీ అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొని ఉంది. కార్పొరేషన్ అయిన తర్వాత పట్టణ ప్రజల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలగా తయారైందని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం పట్టణంలో అన్ని ప్రాంతాలకు మున్సిపల్ కుళాయిల ద్వారా మంచినీరే సక్రమంగా సరఫరా కావడం లేదని పట్టణ ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం పడకేసింది. పంచాయతీలకు అధికారం లేకపోవడంతో కరెంటు బిల్లు చెల్లించడానికి కూడా డబ్బులు లేక సతమతమవుతున్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైన, పన్నుల భారం మోపటంలో మాత్రం ముందంజలో ఉన్నారు. 2024లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే ఏంటీఎంసీ కార్పొరేషన్ నుండి తాడేపల్లి పట్టణాన్ని విడగొట్టి గతంలో లాగా తాడేపల్లి మున్సిపాలిటీగా చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ నుండి తాడేపల్లి ని విడగొట్టి, పూర్వ వైభవం కావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


కార్మికుల నివాస గృహాల వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు

కార్మికుల నివాస గృహాల వద్ద సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - తుళ్ళూరు

రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు అవసరమైన సదుపాయాల కల్పనకు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు చర్యలు చేపట్టారు. ప్రపంచ బ్యాంకు మార్గదర్శకాల కనుగుణంగా నివాస గృహాల వద్ద తాగునీరు, విద్యుత్, రోడ్లు,మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించేందుకు చర్యలు ముమ్మరం చేశారు.ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సోమ, మంగళ వారాల్లో రాజధానిలో పర్యటిస్తుందని, కార్మికుల నివాస గఅహాల వద్ద సదుపాయాల కల్పన తీరును పరిశీలించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కార్మికుల కోసం నివాస గృహాల వద్ద ఆదివారం నేల చదునుతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాయి. కార్మికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అవసరమైన పలు సూచనలు చేశారు. మరోవైపు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం పర్యటిస్తుందన్న ప్రచారంతో పనులు ఊపందుకున్నాయి.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా : సర్పంచ్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


బాదం అమ్ముకునే వ్యక్తికి నోటీసలు ఇస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్ రమాదేవి పంచాయతీ లోని పారిశుధ్యం పై ప్రత్యేక దఅష్టి సారించారు. ఈ నెల 17 వ తారీకు జరిగిన సమావేశం లో పారిశుధ్యం పై వాడి వేడిగా చర్చ సాగింది ఆ సమావేశం లో సర్పంచ్ సభ్యులు తీసుకున్న నిర్ణయం ప్రత్తిపాడు ప్రధాన రహదారి వెంట చెత్త వేయకూడదు అలా రోడ్డు వెంబడి చెత్త వేసిన వారిని గుర్తించి వారికి జరిమానా కూడా వేయాలని సూచించారు.ప్రత్తిపాడు ప్రధాన రహదారిపై చెత్త వేయడం దుర్వాసన కూడా వస్తుంది అని గుర్తించారు. వెంటనే కార్యదర్శి షేక్ ఖాజాకి చెప్పి చెత్త వేసే పాయింట్లను గుర్తించి ప్రాతంలో ఉన్న షాప్ యజమానులకు నోటీస్ జారీ చేశారు. ఆదివారం నుండి అమలులోకి వస్తుంది అని పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా తెలిపారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన కేంద్రమంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి - తాడికొండ

దాతల సాయంతో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాల్ ను ఆదివారం కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమసాని చంద్రశేఖర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు జిల్లాకు చెందిన దాతలు సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి ప్రసాద్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తూ ముందుకు వచ్చారని అన్నారు. జీవితాంతం కష్టపడి రూపాయికి రూపాయి పొదుపు చేసి ప్రభుత్వానికి 40 శాతం పన్నులు కట్టి, మిగిలిన సొమ్మును మనలాంటి తెలియని వాళ్ళ కోసం విరాళం ఇచ్చిన ఆ దంపతులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. రూ.42 లక్షలతో ఈ బీసీ కమిటీ హాల్ ను నిర్మించనున్నట్లు. తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అందరికీ ఉపయోగపడేలా ఉంటుందన్నారు. నియోజకవర్గానికి మూడు కమ్యూనిటీ


శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని

హాళ్లను నిర్మించనున్నట్లు, అందులో ఒకటి రావెల గ్రామానికి కేటాయించాలన్న శ్రావణ్ కుమార్ అభిప్రాయం మేరకు ఇక్కడ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, సర్పంచ్ రావేల శైలజ, దగ్గుమల్లి శ్రీనివాసరావు , బీసీ నాయకులు పల్లా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మోడీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు చేసిందేమీ లేదు

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రజలలో ఆర్థిక అసమానతలు పోయి కుల, వర్గ వివక్ష లేకుండా దేశం సుభిక్షంగా ఉండాలి అంటే కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో తిరిగి అధికారంలోకి రావాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పొన్నూరు నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి గాదె నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు చేసింది ఏమీ లేదని 2014లో రాజధాని శంకుస్థాపన కోసం రెండు రాగి చెంబులు మాత్రమే ఇచ్చి వెళ్లారు అన్నారు. పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశాల మేరకు పొన్నూరు నియోజకవర్గంలో నూతన అధ్యక్షులను నియమించినట్లు తెలిపారు. బాపట్ల పార్లమెంట్ ఇంచార్జ్ గడ్డం పాల్ విజయ్ కుమార్, పెదకాకానికి చెందిన షేక్


నియామక పత్రాలు అందుకున్న నూతన అధ్యక్షులు

నాగుల్ మీరా, చేబ్రోలుకు చెందిన వేజెండ్ల వరప్రసాద్ రావు, పొన్నూరు రూరల్‌కు చెందిన అందే దిలీప్ కుమార్, పొన్నూరు టౌన్ ఒక చెందిన తాడిశెట్టి సాంబయ్యలకు నియామక పత్రాలు అందజేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జన్నల వెంకటరెడ్డి, సబ్బా కృష్ణ బాబు పాల్గొన్నారు.

173వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు ఆదివారం నాటి కీ 173 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఏం సాంబశివరావు, సుబ్బారావు, బి.నవనీతం, డి.రమణ, ఎం.శారద కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎన్నికల సందర్భంగా ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యను



పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం సాంబయ్య, కె.అగ్గయ్య, ఎస్ కే భాష, ఎం.గురవయ్య, టి.దుర్గాభవాని, వై.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శారద

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన డి3 సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ గ్రామం బుర్రిపాలెంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతినెల చివరి ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. డాక్టర్ డి.శారద మాట్లాడుతూ కోవిడ్ పరిస్థితులపై ప్రభుత్వం అప్రమత్తం చేసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మాస్క్ ఉపయోగించాలని కోరారు. ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు రక్త పరీక్షలు, ఈసీజీ ఉచితంగా నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ బృందం చందన, దీప్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న చిరుమామిళ్ల మల్లికార్జునరావు

వట్టిచెరుకూరు వాసికి మలేషియాలో అవార్డు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజక వర్గం పరిధిలోని వట్టి చెరుకూరు వాసికి మలేషియాలో అవార్డు అందుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వట్టి చెరుకూరు చెందిన చిరు మామిళ్ళ మల్లికర్జునరావు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మైనింగ్ విభాగంలో పవర్ మెక్ ప్రాజెక్ట్ లిమిటెడ్ కంపెనీ ఆపరేటర్ హెడ్, జనరల్ మేనేజర్ అయితే ఇండియాకి చెందిన ఒక ప్రముఖ మీడియా మలేషియాలో వివిధ రంగాలలో రాణించిన వారికి అవార్డుల ప్రదానం చేశారు. అందులో భాగంగా చిరుమామిళ్ల మల్లికార్జునరావుకి డైనిక్ భాస్కర్ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. చిరుమామిళ్ల మల్లికార్జునరావు అవార్డు అందుకున్న సందర్భంగా వట్టిచెరుకూరు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒకటి నుంచి సినిమాలు బంద్ లేనట్టే

ప్రజాశక్తి-తెనాలిరూరల్


మాట్లాడుతున్న దిలీప్‌రాజా

కాంప్రహెన్సివ్ ఫిలిం డెవలప్‌మెంట్ పాలసి ప్రవేశపెట్టడంతో సిని పరిశ్రమకు మేలు జరుగుతుందని దర్శకుడు దిలీప్ రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వం నూతనంగా సినిమాకు పరిశ్రమ హెూదా కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకమన్నారు. స్థానిక మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుండి పర్సంటేజ్ చెల్లించాలన్న డిమాండ్స్ పై ఎగ్జిబిటర్లు తలపెట్టిన సినిమా బంద్ ఇకపై ఉండదని రాష్ట్ర సినిమా ఫోటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించడం సంతోషకరమన్నారు. థియేటర్ యజమానుల ప్రమేయం లేకుండా లీజుకు తీసుకున్న కొందరి ఎత్తుగడలను ప్రభుత్వం హెూమ్ సెక్రెటరీ ద్వారా విచారణకు ఆదేశించడంతో సినిమా ప్రదర్శనలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. నూతన పాలసి ప్రకారంగా ఇకపై ఎవరిని వ్యక్తిగతంగా సంప్రదించకుండా సినిమా సంఘాలతోనే చర్చలు జరుపుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించడం శుభ పరిణామమన్నారు. 24 విభాగంలో నైపుణ్యాల పెంపుదల అమలుకొస్తే అధునాతన సాంకేతిక విధానంపై దర్శకులు దృష్టి సారిస్తారని చెప్పారు. సమావేశంలో మిటలరీ ప్రసాద్, వేమూరు విజయభాస్కర్ పాల్గొన్నారు.



కొద్దిపాటి వర్షానికే మునిగిన రోడ్డు

ఇది చెరువు కాదు.. నిత్యం రాకపోకలు జరిగే బజారు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈ ఫొటో చూసి ఇదేదో చెరువు లేదా కాలువ అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్టే. తాడేపల్లి పట్టణంలోని సుందరయ్య నగర్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మోకాళ్ల లోతు నీరు నిలబడిపోయింది. వర్షపు నీటితో పాటు మురుగునీరు తోడై ఇళ్లలోకి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. వర్షపు నీరు నిలబడటంతో ఈ బజార్లో వాహనాలు రాకపోకలకు కూడా అంతరాయం కలిగింది. నీరును బయటకు తోడటానికి ఇంజన్‌ని పెట్టుకుంటున్నారు. నెలరోజుల క్రితం ఈ ప్రాంతంలో మాజీ ఎంపీ మధు సిపిఎం నాయకులుతో కలిసి పర్యటించారు. మురుగు సమస్య లు వెంటనే పరిష్కరించమని అధికారులను కోరారు. చర్యలు తీసుకుంటామని చెప్పిన అధికారులు యధావిధిగా మిన్నకుండిపోయారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి సుందరయ్య నగర్ ప్రగతి బాల విద్యాలయం సమీపంలోని రోడ్ల డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని స్థానికులు కోరుతున్నారు.

సమ్మె విరమించిన ఆరోగ్య శాఖ ఉద్యోగులు

ప్రజాశక్తి - నరసరావుపేట టౌన్

గత 27 రోజులుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను వైద్య,ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఇచ్చిన హామీ మేరకు ఏపీ ఎమ్ సి ఏ నాయకులు సమ్మె విరమిస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. శుక్రవారం నాడు ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి తమ సమస్య మీద చర్చించిన క్రమంలో మంత్రి కూడా సానుకూలంగా స్పందించి సమ్మె విరమించి విధులకు హాజరు అవ్వాలని సమస్యల మీద పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారని మంత్రి ఇచ్చిన హామీ మేరకు ఏపీఎమ్‌సిఏ రాష్ట్రనాయకులు నిరంజన్, సందీప్, వినోద్ సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఈ సమ్మె కాలంలో సమ్మెకు అనుమతి ఇచ్చిన కలెక్టర్‌కు వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, పోలీస్ అధికారులకు, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బందికి,మెడికల్ ఆఫీసర్లకు అన్ని విధాలుగా సహాయసహకారాలు అందించిన సూపర్వైజర్ కేడర్ ఉద్యోగులకు, ఏఎన్‌ఎం లకు, ఆశా కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమస్యలు ప్రభుత్వానికి తెలిసేలా ఎప్పటికప్పుడు సమస్యలను వార్తాపత్రికలో కథనాలు వేస్తూ తోడ్పాటు అందించిన మీడియా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంసిఏ జిల్లా కమిటీ అనుపమ, మస్తాన్, రాము, శివ, శివ నాయక్, కోటి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం..



గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచడం, వలసలు నివారించి వ్యవసాయ శ్రామికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని జిల్లా నీటి నిర్వహణ సంస్థ (డ్వామా) పీపీ ఎం. సిద్ధలింగ మూర్తి తెలిపారు. వలసల నివారణకు ప్రవేశ పెట్టిన పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పంట కాల్వల ఆధునీకరణ, పచ్చదనం పెంపొందించేందుకు రోడ్ల వెంట మొక్కలు నాటడం, నీటి కుంటలతో ఉద్యాన పంటల సాగుకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి పెంపొందించడం కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు వేతన ఉపాధి కల్పించడం కోసం సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

- కూలీల వలసల నివారణకు చర్యలు
- ఉపాధికూలీ బకాయిలు రూ.50.09 కోట్లు
- గోకులాలు, మురుగు కాల్వలు, నీటి తొట్టెలు నిర్మాణం
- పండ్లు, పూలతోటల సాగు పనులు
- 'ప్రజాశక్తి'తో డ్వామా పీడీ ఎం.సిద్ధ లింగమూర్తి



పల్నాడు జిల్లాలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి? కూలీల సంఖ్య?

కూలీలను గౌరవం ఇవ్వడంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సూచన మేరకు కూలీలు అని కాకుండా శ్రామికులుగా గుర్తింపు ఇవ్వడం జరిగింది.

పల్నాడు జిల్లాలో 345095 జాబ్ కార్డులకు సంబంధించి 599179 మంది శ్రామికులు ఉన్నారు. 262850 జాబ్ కార్డులకు సంబంధించిన 447099 మంది శ్రామికులు పథకం కింద పని చేసి లబ్ది పొందుతున్నారు.

ఈ ఏడాది పని దినాలు ఎన్ని? ఎంత మేర కల్పించారు?

ఈ ఏడాది 85 లక్షల పని దినాల లక్ష్యం నిర్దేశించగా లక్ష్యంలో 20 శాతం మేర పూర్తి చేశాం. శ్రామికులకు సగటు వేతనం రూ 286/- చొప్పున చెల్లించడం జరుగుతుంది. ఈ ఏడాది కొత్తగా మురుగు కాల్వలు, నీటి తొట్టెలు, గోకులం షెడ్లను నిర్మించాం. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 200 లకు పైగా నీటి కుంటలు తీయడం జరిగింది.

గత ఏడాది కంటే లక్ష పని దినాలు తగ్గాయి? కారణం అవినీతి ఆరోపణలా? మరేమైనా ఉన్నాయా?

పని దినాలు తగ్గించడంలో మా ప్రమేయం లేదు. అది పూర్తిగా బడ్జెట్ సవరణలకు సంబంధించిన అంశం.

పథకం ఆరంభం నుండి అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని రికవరీ చేస్తున్నాం. పారదర్శకత కోసం శ్రామికులతోనే తనిఖీలు చేయించాలని కేంద్ర ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో దీనికై రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సర్పంచ్ నేతఅత్వంలో కమిటీలు ఏర్పాటు చేసి ఉపాధి హామీ కూలీలను కమిటీ సభ్యులుగా నియమించడం జరుగుతుంది. పంచాయతీ ఎన్నికల అనంతరం ఈ ప్రక్రియ అమలు కానుంది.

ఉపాధి హామీలో ఎటువంటి పనులు కల్పిస్తున్నారు?

పల్నాడు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథ కం సమర్థవంతంగా పని చేస్తోంది. గ్రామీణ ప్రాంతా లలో 100 రోజులు, బల్లాపల్లి, మాచర్ల, గురజాల లోని గిరిజన ప్రాంతాల్లో 150 రోజుల పనిదినాలు కల్పించి జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని దినాలు కల్పిస్తున్నాం. చెరువులలో, పంట కాలువలలో పూడికతీత, పంట కాల్వల మరమ్మత్తులు, నీటి తొట్టెలు, పశువుల షెడ్లు నిర్మాణానికి, గేదెలకు గడ్డి పెంపకం మొక్కలు నాటడం తోపాటు ఉద్యాన శాఖను అనుసంధానం చేసి పండ్ల తోటలు, మల్లె గులాబీ, మునగ, ఆయిల్ ఫామ్ వంటి పంటల లపై రైతులకు అవగాహన కల్పించి ఆయా పంటలు సాగుకు సంబందించి 8 ఏళ్ల పాటు ఎకరాకు ఏడాదికి రూ 30వేలు నుండి రూ 55 వేలు వరకు ఇవ్వడం జరుగుతుంది.

పథకం కింద యంత్రాల ద్వారా ఎటువంటి పనులు చేస్తున్నారు?

శ్రామికులకు పనులు కల్పించడమే లక్ష్యంగా పథకం సక్రమంగా అమలు చేస్తున్నాము. యంత్రాల ద్వారా చేసే ఎటువంటి పనులు గుర్తించలేదు. ఎటువంటి పనులు చేపట్టలేదు.

ఉద్యాన పంటలకు సంబంధించి పల్నాడు జిల్లాలో లక్ష్యం?

పండ్ల తోటలు, పూల మొక్కలు వివిధ ఉద్యాన పంటలకు సంబంధించి 3500 వేల ఎకరాల లక్ష్యం కాగా ప్రస్తుతం 447 మంది రైతులు ఇప్పటికే 1053 ఎకరాలలో సాగు చేసేందుకు ముందుకు వచ్చారు. ముందుకు వచ్చిన రైతులకు పథకాలు రాయితీల గురించి గ్రామ స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్, మండల స్థాయిలో ఏపిఓ, మండల పరిషత్ అధికారులు ఎప్పటికప్పుడు వివరించడం జరుగుతుంది. పండ్ల తోటలకు సాగుకు ప్రధానంగా బల్లా పల్లి, వెల్దుర్తి, రైతులు అధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారు.

శ్రామికులకు వేతనాలు బకాయిలు ఎంత మేర ఉన్నాయి? ఎప్పుడు చెల్లిస్తారు?

గత ఆర్థిక సంవత్సరం అనగా ఈ ఏడాది మార్చి చివరి వరకు శ్రామికులకు వేతనాలు చెల్లింపులు జరిగాయి. ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు చెల్లించాల్సిన వేతనాలు రూ 50.09 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. వీటి చెల్లింపులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో నేరుగా శ్రామికుల ఖాతాలకు జమ అవుతాయి.

పని ప్రదేశంలో గాయపడిన వారికి ఏమైనా బీమా సౌకర్యాలు ఉన్నాయా?

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి భీమా లో నమోదు కావడం ఉత్తమం. పని ప్రదేశంలో గాయపడితే చికిత్సకు నగదు సహాయం, పనికి వస్తూ, పని ప్రాంతంలో, పని ప్రాంతం నుండి ఇంటికి వెళుతున్న క్రమంలో మఋతి చెందితే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన ద్వారా లబ్ది చేకూరుతుంది.

పని ప్రదేశంలో వసతులు, పనిముట్లు పంపిణీ వివరాలు?

పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు కూలీలకు మంచి నీరు ఏర్పాటు చేస్తున్నాం. నీడ కోసం టర్పాలిన్లు ప్రాథమిక చికిత్స కోసం కిట్లను ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సమకూర్చుకోవడం జరుగు తుంది. దీనికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో ఎటు వంటి బడ్జెట్ కేటాయించలేదు.గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో శ్రామికులకు మజ్జిగ పంపిణీ జరుగుతుంది. ప్రస్తుతం పనిముట్లను ఉపాధి కూలీల ఎవరికి వారు తెచ్చుకోవడం జరుగుతుంది. కూలీలకు పనిముట్లు సంబంధించి ప్రభుత్వానికి నివేదించాము.

భారీగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి?

పల్నాడు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగానే అమలు చేస్తున్నప్పటికీ కొంత మేర అవినీతి జరుగుతుంది. ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో సామాజిక తనిఖీల ద్వారా పరిశీలించి నలుగురు ఏపీఓ లకు షోకాజు నోటీసులు జారీ చేసి 10 మంది ఫీల్డ్ అసిస్టెంట్ లను సస్పెండ్ చేసి కొంత మేర రికవరీ చేయడం జరిగింది. పథకంలో అవినీతి ఆరోపణలు నిరూపణ అయితే కఠిన చర్యలు తప్పవు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని దినాలు కల్పించాలని సిబ్బందికి సూచిస్తున్నాం. శ్రామికులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సామాజిక తనిఖీ అధికారులు జరిపిన గ్రామ సభలలో ఏమైనా ఫిర్యాదులు వస్తే గ్రామంలో జాబ్ కార్డు కలిగిన వారి ఇంటింటికి వెళ్లి పథకం ద్వారా కలిగిన లబ్ధిని అడిగి తెలుసుకుంటారు. పథకం అమలు తీరుపై క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది నిఘా ఉంటుంది.

ప్రజాశక్తి-పల్నాడుజిల్లా

పనులు మాటల్లో కాదు చేతల్లో కనపడాలి

పారిశుధ్య నిర్వహణపై కార్పొరేటర్లకు పెమ్మసాని దిశా నిర్దేశం

ప్రజాశక్తి - గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, డ్రైన్లలో సిల్టు తొలగింపు, కుక్కల బెడదకు పరిష్కారం తీసుకురావాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. సమస్యల పరిష్కారంలో అధికారులు మాటలు చెబుతున్నారు. చేతల్లో కన్పించడం లేదు..మీరు కూడా మాటలు కాదు చేతలతో గుంటూరు ప్రజలకు పరిష్కారం చూపాలన్నారు. నెల రోజుల్లోపు గుంటూరులో టిడిపి మార్క్ అభివఅద్ధి కనపడాలన్నారు. నగరంలో ఎదురవుతున్న పారిశుధ్య సమస్యలు, కార్పొరేషన్ సంబంధిత అంశాలపై పెమ్మసాని ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శానిటరీ వర్కర్లతో పని చేయించుకోవడం, నిత్యం పారిశుధ్య పనులపై ప్రత్యేకంగా 2 గంటలు దృష్టి సారించాలని కార్పొరేటర్లకు ఆయన సూచించారు. నగరంలో కుక్కల బెడదకు గాని, డ్రెయిన్ల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు గాని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు మేయర్‌కి కూడా తెలియజేయాలని చెప్పారు. మేయర్ తక్షణమే స్పందించి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పరిష్కారం చూపడానికి సిద్ధంగా ఉన్నారని, శానిటరీ వర్కర్లను సమన్వయం చేసుకోవడంలోనే అసలు పరిష్కారం లభిస్తుందని వివరించారు. కాగా తమ తమ డివిజన్లో వర్కర్లు తక్కువగా ఉన్న కారణంతో పారిశుధ్య నిర్వహణ ఆలస్యం అవు తుందని పెమ్మసాని దృష్టికి తీసుకువచ్చారు త్వరలో నిర్ణయం తీసుకుంటామని పెమ్మసాని తెలిపారు. ప్రతి నెలా ఇదే తరహాలో కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించి గుంటూరును ది బెస్ట్ ప్లేస్ సిటీగా మార్చే బాధ్యతను ప్రతి ఒక్కరు బాధ్యతగా చేపడతామన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర బాబు (నాని), ఎమ్మెల్యే మొహమ్మద్ నశీర్ అహ్మద్, కార్పొరేటర్లు పోతురాజు సమత, నూకవరపు బాలాజీ, కొమ్మినేని కోటేశ్వరరావు, మానం పద్మశ్రీ పాల్గొన్నారు.

దేశ ప్రజలు మతసామరస్యాన్ని కోరుతున్నారు

ప్రజాశక్తి- తాడేపల్లి

పహల్గాం ఘటన తర్వాత దేశ ప్రజలు మత సామరస్యాన్ని కోరుకున్నారని. అదే సమయంలో ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులను మట్టుపెట్టాలని దేశవ్యాప్తంగా ప్రజలు ముందుకు రావడానికి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ హర్షించారు. ఆదివారం సాయంత్రం తాడేపల్లి పట్టణంలోని బోసు బమ్మ సెంటర్ నుండి ముగ్గురు సెంటర్ వరకు సమైక్యత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సభ నిర్వహించారు. నేతాజీ మాట్లాడుతూ దేశ సమైక్యత, మతసామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బిజెపి, సంఘ పరివార్ ఈ ఘటనను తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకో చూశాయని విమర్శించారు. దీనికి తగ్గట్టు మీడియాలో ఒక భాగం మోడీ మీడియాగా మారి అర్ధసత్యాలు, భారత్, పాకిస్తాన్ ప్రమేయం లేకుండానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన మధ్యవర్తిత్వంతో యుద్ధం నిలుపుదల చేయడం జరిగిందని ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రకటన భారతదేశ సార్వభౌమత్వానికి విఘాతం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం వద్దు, శాంతి చర్చలే



తాడేపల్లి బోసు బొమ్మ సెంటర్‌లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

జరగాలని సిపిఎం కోరితే మోడీ మీడియా సిపిఎంపై అవాకులు చవాకులు పేలారని విమర్శించారు. చివరకు సిపిఎం చెప్పినట్లుగానే యుద్ధం ముగిసిందని, ప్రజలు గమనించాలని కోరారు. సిపిఐ మంగళగిరి ఏరియా నాయకులు కంచర్ల కాశయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దర్శనపు సామేలు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, గాదే సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు,కె.మేరీ, కె.బాబు రావు, నారిన నాగేశ్వరరావు, వై.బర్నబాస్, డి.వి.భాస్కర్ రెడ్డి, ఎం.డి.బాజ్జి, కోటేశ్వరరావు, ఎస్.కే. భాష, ఎల్.సత్యం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దర్శనపు సామేలు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కే వెంకటయ్య, మానికొండ డాంగే తదితరులు పాల్గొన్నారు.